ప్రజాశక్తి

మంగళవారం 3 డిసెంబర్ 2024



రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-చింతపల్లి: రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఆటో డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలని లోతుగడ్డ జంక్షన్ ఆటో యూనియన్ అధ్యక్ష ఉపాధ్యక్షుడు ప్రసాద్, అరుణ్ కుమార్ సూచించారు. లోతుగడ్డ జంక్షన్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో వంగసారి సమీపంలో వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డ్రైవర్లందరికీ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన పత్రాలు ఉండాలన్నారు. పోలీస్ శాఖ సూచించిన సూచనలను క్రమం తప్పకుండా ఆటో యజమానులు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో లోతుగడ్డ జంక్షన్ ఆటో యూనియన్ కోశాధికారి అభి, రాము, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆటో యూనియన్ నేతలు

ఆదివాసీలకు అండ.. ఎర్రజెండా..

- సమస్యలపై సిపిఎం నిరంతర పోరు- ఈ నెల 4, 5న పాడేరులో ఆ పార్టీ అల్లూరి జిల్లా ప్రథమ మహాసభలు

ప్రజాశక్తి - పాడేరు

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రజా సంఘాలకు బాసటగా నిలుస్తూ గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం నిరంతర పోరు సాగిస్తోంది. ఎర్రజెండా ఆదివాసీలకు అండగా నిలుస్తోంది. ఆదివాసీల సంక్షేమానికి, అభివృద్ధికి క్రియాశీలకమైన కార్యాచరణతో కృషి చేస్తున్న సిపిఎం ఎన్నో స్ఫూర్తిదాయక పోరాటాలకు నేతృత్వం వహించింది. 2022లో అల్లూరి సీతారామరాజు జిల్లా ఆవిర్భావం తర్వాత జిల్లాలోని 22 మండలాల్లోనూ ఆదివాసీలకు అండగా నిలిచి అనేక పోరాటాలు సాగించి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుంది. ఈ క్రమంలోనే ఆ పార్టీ అల్లూరి జిల్లా ప్రథమ మహాసభలు పాడేరు వేదికగా ఈ నెల 4, 5 తేదీల్లో జరుగనున్నాయి. మహాసభల జయప్రదానికి ఇప్పటికే ఆ పార్టీ శ్రేణులు ఉధృత ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గడిచిన కాలంలో ఆ పార్టీ నిర్వహించిన కొన్ని కీలకమైన పోరాటాలను గుర్తుచేస్తూ సాగేదే ఈ కథనం.

గిరిజనులకు నష్టం చేకూర్చే హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌లపై పోరు

పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో నాలుగు హైడ్రో పవర్ ప్రాజెక్టులను అదానీ, షిరిడీ సాయి గ్రీన్ ఎనర్జీ కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన చింతపల్లి మన్యం బంద్ నాడు ఉధృతంగా సాగింది. గ్రామీణులను ఎక్కడికక్కడ ఎర్రజెండా చైతన్యపరిచింది. దీంతో పాడేరు ఎమ్మెల్యే, అరకు ఎంపీ కార్పొరేట్ కంపెనీలకు అమ్ముడుపోయారని గిరిజనులు గ్రామాల్లో ఆయా ప్రజాప్రతినిధులను నిలేశారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణం వల్ల సుమారు 30 వేల అటవీ ప్రాంతం మునిగే అవకాశం ఉందని, 150 గిరిజన గ్రామాలలో ప్రత్యక్షంగా సుమారు 30 వేల మందిపై ప్రభావం ఉంటుందని సిపిఎం అధ్యయనం చేసి గ్రామస్థాయిలో సదస్సులు, సంతకాలు సేకరణ, సభలు మొదలగు కార్యక్రమాలతో గిరిజనులను చైతన్యపరిచింది. కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు ఎవరైనా గ్రామాల్లోకి ప్రవేశిస్తే అడ్డుకొని తిప్పి పంపించే విధంగా గిరిజనులను సన్నద్ధం చేసింది. ఇలా ఏజెన్సీలో హైడ్రో ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి వ్యతిరేకంగా గిరిజనులకు అండగా నిలిచింది. పాడేరు చలో కలెక్టరేట్ కార్యక్రమాలను రెండు ధపాలుగా నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు ఇచ్చే కార్యక్రమాలు కొనసాగించింది, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హైడ్రోపవర్ ప్రాజెక్టు మంజూరైన గానుగుల గ్రామంలో పర్యటించారు. సిపిఎం పోరాట ఫలితంగా నేటికీ ఆయా ప్రాంతాల్లో ఎటువంటి హైడ్రో ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. చిట్టంపాడు, పెదకోట హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేయాలని సిపిఎం మాజీ ఎంపీ. కె.మధు సైతం గిరిజన చైతన్య సభల్లో పాల్గొని హైడ్రో పవర్ ప్రాజెక్టు రహస్య సర్వేను అడ్డుకున్నారు.

కాఫీ రైతుల ఐటిడిఎ ముట్టడి

పాడేరు ఏజెన్సీ 11 మండలాల్లో కాఫీ రైతులకు బకాయి సొమ్ము ఇవ్వాలని, గిట్టుబాటు ధరలు కల్పించాలని, కాఫీ ప్రాజెక్టులో అవినీతి అరికట్టాలని కోరుతూ సిపిఎం నాయకులు గ్రామాల్లో క్యాంపెయిన్ నిర్వహించారు. వేలాది మంది గిరిజన రైతులతో ఐటిడిఎ ముట్టడి నిర్వహించారు. గ్రామాల్లో రైతులతో ఆందోళన లేవనెత్తారు. 11. మండలాల్లో సదస్సులు కొనసాగించి మొత్తం 32000 మంది కాఫీ రైతులను సమాయత్తం చేసి కాఫీ రైతులకు 2018 నుంచి ఉన్న బకాయి సొమ్ము రూ.60 కోట్లు చెల్లించాలని, కాఫీ ప్రాజెక్టుల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని, 2000 మంది కాఫీ రైతులతో ఐటిడిఎని సిపిఎం ముట్టడించింది. జిల్లా కలెక్టర్ ధర్నా శిబిరంలోకి వచ్చి బకాయి సొమ్ము చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దీంతో కాఫీ రైతుల్లో సిపిఎం పలుకుబడి మరింత పెరిగింది.

ఉపాధి హామీ, పోడు పట్టాల సమస్యలపై

ఉపాధి హామీ కూలీల సమస్యలపై పాడేరు ఏజెన్సీ 11 మండలాల్లో సిపిఎం ఉద్యమించింది. వారికి బకాయిలు వెంటనే ఇవ్వాలని ఎంపిడిఒ కార్యాలయాల వద్ద ధర్నాలు, పోస్టాఫీసుల వద్ద నిరసనలు నిర్వహించింది. ఫలితంగా ఆ సమస్య పరిష్కారమైంది.

అటవీ పోడు భూములకు పట్టాలివ్వాలని ఏజెన్సీ 11 మండలాలు, నాన్ షెడ్యూల్డ్ ఏరియాల్లో వివిధ రూపాల్లో సిపిఎం ఆందోళనలు నిర్వహించింది. మండలాధికారులకు అర్హులైన వారితో దరఖాస్తులు పెట్టించింది. డౌనూరు పంచాయతీ ముల్లుమెట్టలో అటవీ భూముల్లో గిరిజనులు సాగుచేస్తున్న రాగి పంటలను ఫారెస్టు అధికారులు ధ్వంసం చేసిన తీరుకు నిరసనగా ధర్నాలు చేసింది. అనేకమంది లబ్ధిదారులకు పోడు పట్టాలు పంపిణీ జరిగిందంటే అది సిపిఎం పోరాట ఫలితమేనని చెప్పకతప్పదు. ఇవేగాకుండా మాతృభాష విద్యా వాలంటీర్లు, స్కీం వర్కర్లు, ఆదివాసీ విద్యార్థి, యువత సమస్యలపైనా ఉద్యమించింది. రోడ్లు, ఆసుపత్రులు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పన కోసం పోరాటాలు నిర్వహించింది.



అరకు లోయలో ప్రజా సమస్యలపై ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు (ఫైల్ ఫోటో)





వాహన తనిఖీలు చేస్తున్న సీలేరు ఎస్ఐ రవీంద్ర, పోలీసులు

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి-సీలేరు

మావోయిస్టు పార్టీ పిఎల్‌జిఎ వారోత్సవాలు ఈ నెల 2 నుంచి 8 వరకు జరుగుతున్న నేపథ్యంలో జీకే వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి స్థానిక ఎస్సై కే.రవీంద్ర, సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. మావోయిస్టుల నుంచి జల విద్యుత్ కేంద్రానికి, ప్రభుత్వ ఆస్తులకు ఎటువంటి ముప్పు వాటిల్లకుండా పగలు, రాత్రి పహారీ కాస్తున్నారు. నైట్ సర్వీస్ బస్సులో తనిఖీలు ముమ్మరం చేశారు. ఏపీ జెన్కో చెక్‌పోస్టు, ఐటిఐ జంక్షన్, పోస్ట్ ఆఫీస్ పరిసర ప్రాంతాల్లో సిఆర్‌పిఎఫ్ పోలీసు బలగాలను మోహరించి భద్రత కట్టుదిట్టం చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌కి ఎటువంటి ముప్పుకలకుండా సిఆర్‌పిఎఫ్ బలగాలతో భద్రత చర్యలు చేపట్టారు.



గాయపడిన యువకులకు వైద్యం అందిస్తున్న డాక్టర్ హిమబిందు

అదుపుతప్పి బైక్ బోల్తా

- ఇద్దరు యువకులకు గాయాలు

ప్రజాశక్తి-సీలేరు

మద్యం మత్తులో ఇద్దరు యువకులు అతి వేగంగా ద్విచక్ర వాహనం నడుపుతూ దారకొండ శ్మశాన వాటిక సమీపంలోని ప్రధాన రహదారిపై అదుపుతప్పి బోల్తా పడ్డారు. ఈ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. జీకే వీధి మండలం దారకొండ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ హిమబిందు తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతేడు పంచాయతీ పాతకోట గ్రామానికి చెందిన గడుతూరి ధారబాబు, వణుగుల శాంతి కుమార్ ఇద్దరు యువకులు సోమవారం ద్విచక్ర వాహనంపై కాకినాడ బయలుదేరారు. దారకొండ శ్మశానవాటిక సమీప ప్రధాన రహదారిపై అదుపుతప్పి బైక్ బోల్తా పడింది. ఈ ఘటనలో గడుతూరి ధారబాబుకు ముఖానికి, తలకు ఛాతి భాగంలో బలంగా గాయాలు కావడంతో స్పృహ కోల్పోయాడు. శాంతి కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఇది గమనించిన దారకొండ గ్రామస్తులు దారకొండ పిహెచ్‌సికి సమాచారం ఇవ్వడంతో వెంటనే అంబులెన్స్‌లో వారిని ఆసుపత్రికి తరలించారు. ధారబాబుకు అప్పటికే ఊపిరి సక్రమంగా అందకపోవడంతో గంటపాటు సిపిఆర్ చేయడంతో హార్ట్ బీట్ నెమ్మది కొట్టుకోవడంతో ప్రాణహాని తప్పింది. తరువాత ఆక్సిజన్ పెట్టి వైద్య సేవలు అందించారు. ఇద్దరు యువకులు మద్యం సేవించి ఉన్నారని డాక్టర్ హిమబిందు తెలిపారు. మరో వైపు కమ్మరితోట వద్ద ఒక దుకాణంలో మూడు లీటర్ల పెట్రోల్ బాటిల్స్ వీరు దొంగిలించి, తమకు దొరక్కుండా వేగంగా బైక్‌పై వెళ్తూ ఉండగా ఈ ప్రమాదం జరిగిందని దుకాణ యజమానికి చెప్పారు. ఈ ప్రమాదం సంఘటనపై సీలేరు పోలీసులకు డాక్టర్ హిమబిందు తెలియజేశారు. పోలీసులు వచ్చేసరికి ఇద్దరు యువకులు ఆసుపత్రి నుండి వెళ్లిపోయారు. సకాలంలో వైద్య సేవలు అందించి యువకుడి ప్రాణాలు కాపాడిన డాక్టర్ హిమబిందును స్థానిక సర్పంచ్ నడిగట్ల రాజు, బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు ప్రశంసించారు.

ప్రజల వినతులు పరిష్కరిస్తాం

జిసిసి ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: ప్రజా వినతులను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర గిరిజన సహకార సంస్థ ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ వెల్లడించారు. పాడేరులో తన క్యాంపు కార్యాలయంలో వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన వినతి పత్రాలు స్వీకరించారు. ముఖ్యంగా హుకుంపేట మండలం బాకూరు నుండి ఉప్పా రోడ్డు, బొర్రమామిడి కల్వర్టు సపోర్టింగ్ వాల్, ఓల్డా పంచాయితీ పోసలగారువులో కొత్త బోర్వెల్ ఏర్పాటు, మెడికల్ కాలేజ్‌లో గిరిజనులచే పోస్టుల భర్తీ తదితర సమస్యలపై ప్రజలు వినతి పత్రాలు జిసిసి ఛైర్మన్‌కి అందజేశారు. గిరిజన ప్రాంత సమస్యలు పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణ రాజు, దారేల సర్పంచ్ పాంగి పాండురంగస్వామి, మాజీ జడ్పీటీసీ సాగర సుబ్బారావు, అండీభ సర్పంచ్ తామర్ల సత్యనారాయణ, నారంజి ప్రసాద్, లైకోన్, రాంబాబు,త్రినాద్, సూర్యకాంతం, మహేశ్వరీ, పాడి బాలన్న, కామేష్, తిరుపతి తదితరులు కలిశారు.



సమస్యలు తెలుసుకుంటున్న కిడారి



మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

విద్యుత్ ఛార్జీల పెంపుతో ప్రజలపై పెను భారం : వైసిపి

ప్రజాశక్తి -పాడేరు: రాష్ట్రంలోని కూటమి సర్కారు ప్రజలను మోసగించడంలో సూపర్ సిక్స్ అయ్యిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగం, మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి హెద్దేవా చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్సీ రవిబాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్తు అందిస్తుందని ప్రకటించిన సీఎం చంద్రబాబు దీన్ని పూర్తిగా విస్మరించారన్నారు. అధికారంలోకి వచ్చిన 6నెలల వ్యవధిలో రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచిందని, రాష్ట్ర ప్రజలపై 15 వేల485 కోట్ల పెను భారం మోపుతోందని చెప్పారు.

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్య లింగం మాట్లాడుతూ, చంద్రబాబు హయాంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో దగా కోరు పాలన సాగిస్తోందని ఆయన విమర్శించారు. జీవో 3 పునరుద్ధరణకై అరకులో ఎన్నికల హామీలు గుప్పించిన సీఎం చంద్రబాబు దీనిపై ప్రస్తుతం నోరు మెదపడం లేదన్నారు. మెగా డీఎస్సీని, దగా డీఎస్సీగా మార్చేస్తున్నారని అన్నారు. ఉచిత విద్యుత్తు ఇస్తామని చెప్పి ఇప్పుడు ఆ ఉసేత్తకుండా విద్యుత్ చార్జీల భారం ప్రజలపై మోపేందుకు ఈ ప్రభుత్వం సిద్ధమయ్యిందని. విమర్శించారు.

పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ, అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని ఊరు వాడా గడప గడపకు వెళ్లి చెప్పిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై విద్యుత్ ఛార్జీల అధిక భారం మోపుతున్నారన్నారు. ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలపై దృష్టి పెట్టాలన్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాల జెడ్పీ ఛైర్పర్సన్ సుభద్ర మాట్లాడుతూ, చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేక పోయారని, ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. మాజీ శాసన సభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై వైయస్సార్సీపి అండగా నిలిచి పోరాడుతుందని అన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు ఎస్.రాంబాబు, వైస్ ఎంపీపీ కె.కనకాలమ్మ, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు,

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి -జి.మాడుగుల: మండలంలో వంజరి పంచాయతీ కిముడుపల్లి గ్రామంలో ఎక్సైజ్ శాఖ సీఐ ఆచార్య సోమవారం యువత మేలుకో భవితను మలుచుకో అనే అవగాహన సదస్సు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్, సారా రహిత ఆంధ్ర ప్రదేశ్ గా తీర్చిదిద్దాలని లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సిఐ

సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయాలి



సిపిఎం మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-సీలేరు

పాడేరులో ఈ నెల 4, 5 తేదీల్లో జరుగుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రథమ మహాసభ జయప్రదం చేయాలని గాలికొండ ఎంపీటీసీ, సిపిఎం మండల కార్యదర్శి అంపరంగి బుజ్జిబాబు, పార్టీ మండల నాయకులు గడుతూరు సత్యనారాయణ పిలుపునిచ్చారు. జీకే వీధి మండల కేంద్రంలో సోమవారం సిపిఎం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక అందించాలని డిమాండ్ చేశారు. పివిటిజి గిరిజనులకు పక్కా ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేయాలని, కోందు, భగత, వాల్మీకి, కమ్మర, కొటియాతో పాటు ఇతర తెగల వారికి ప్రభుత్వం గృహాలు మంజూరు చేయాలని కోరారు. సిపిఎం మహాసభ సందర్భంగా 4న జరుగు భారీ బహిరంగ సభకు వేలాదిమంది ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కొర్ర బాలయ్య, మురళి చంటిబాబు, పాంగి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని డౌనూరు పంచాయితీ తులబాడగెడ్డ గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు తాంబేలు ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 4, 5 తేదీల్లో పాడేరులో జరుగు సిపిఎం ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు తాంబేలు ప్రసాద్



నేలకొరిగిన వరి పంటను కట్టలు కట్టిస్తున్న వ్యవసాయ అధికారి ఉమాదేవి

నేలకొరిగిన వరి పంటల పరిశీలన

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం డౌనూరు, చిట్టెంపాడు రైతు సేవా కేంద్రాల పరిధిలో ఉన్న పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి ఉమాదేవి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అకాల వర్షాలు వల్ల నీట మునిగిన, నేలకొరిగిన వరి పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పొలంలో ఉన్న నీటిని తొలగించాలని, నేలకొరిగిన వరి పంట పన్నలను ముందుగా కట్టలుగా కట్టి నిలబెట్టుకోవాలని సూచించారు. తడిసిన ధాన్యం మొలకెత్తకుండా ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని నీటిలో కలిపి పిచికారీ చేయాలని, తద్వారా మొలక శాతాన్ని నివారించవచ్చని చెప్పారు. త్వరలో ధాన్యం కొనగోలు కేంద్రం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం అగ్రికల్చర్ అసిస్టెంట్ రాజేష్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వలన నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆదివాసీ సంఘం నాయకులు తెల్ల రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని జడ్డంగిలో వరి పొలాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ వర్షాలకు కోతకోసిన వరిచేను పొలంలో తడిసిపోవడంతో రైతులకు తీవ్ర నష్టం సంభవించిందని చెప్పారు. జడ్డంగికి చెందిన మోడిధ వెంకటేష్ అనే గిరిజన రైతుతో బాటు మరికొంతమంది రైతుల పంటల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. తుపాను ప్రభావం తడిసిన ధాన్యాన్ని సాధారణ ధాన్యం ఖరీదుకే కొనే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాంబాబు కోరారు.



తడిసిన వరి పనలను పరిశీలిస్తున్న రాంబాబు

7న ఎయు పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం ఈ నెల 7వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎయు వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.శశిభూషణరావు తెలిపారు. ఆలుమ్ని అసోసియేషన్ జిఎంఆర్ స్మార్ట్ సెమినార్ హాల్లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలను వెల్లడించారు. 7వ తేదీన నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎల్ అండ్ టి గ్రూప్ ఛైర్మన్ ఎస్ఎన్.సుబ్రహ్మణ్యన్, ప్రత్యేక అతిథిగా పద్మశ్రీ డాక్టర్ ఎస్‌వి.ఆదినారాయణరావు హాజరుకానునట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ విశిష్ట అతిథిగా హాజరవుతారని చెప్పారు. ఎయు పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ జిఎం.రావు, విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

పూర్వ విద్యార్థుల సంఘం ఛైర్మన్ డాక్టర్ ఇ.శంకరరావు మాట్లాడుతూ, మధ్యాహ్నం మూడు గంటలకు బీచ్ రోడ్ లోని ఎయు కన్వెన్షన్ సెంటర్లో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 5 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, అనంతరం ప్రధాన సమావేశం ఉంటుందని తెలిపారు. ఆలుమ్ని అసోసియేషన్ వైస్ ఛైర్మన్ డాక్టర్ కుమార్ రాజా మాట్లాడుతూ, ఎయు వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి జయంతిని పురస్కరించుకొని ఏటా డిసెంబర్ నెలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-విఆర్.పురం

వాస్కులర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం విఆర్ పురంలో గ్రామంలో రాజీవ్ సెంటర్ వద్ద రక్తనాళాల వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో మొత్తం 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, వీరిలో 136 మందికి శస్త్ర చికిత్స కోసం గుర్తించారు. వీరికి వాస్కులర్ హాస్పటల్‌లో ఉచితంగా సర్జరీ చేయించడం జరుగుతుందని, యేసియన్ వాస్కులర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రమోద్, డాక్టర్ సాయి, డాక్టర్ కుమార్ తెలిపారు. ఈ శిబిరంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



వైద్య సేవలు అందిస్తున్న డాక్టరు



యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేశ్వరరావు, కృష్ణ

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మహేశ్వరరావు, కృష్ణ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అల్లూరి సీతా రామరాజు జిల్లా అరకులోయ మండల కేంద్రంలోని ఏపీ టూరిజం గెస్ట్‌లో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) అల్లూరి సీతారామరాజు జిల్లా స్వర్ణోత్సవ ప్రథమ మహా సభలు సోమవారం జరిగాయి. ఈ మహాసభ సందర్భంగా మహాసభ ప్రతినిధులు నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యుటిఎఫ్ అల్లూరి జిల్లా అధ్యక్షులుగా వి.మహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కె.కృష్ణ, గౌరవ అధ్యక్షులుగా పి కిష్టయ్య సహ అధ్యక్షులుగా టి.చిట్టిబాబు, యం కవిత, కోశాధికారిగా బి.విశ్వ రాజు, కార్యదర్శులుగా కె.బలిరెడ్డి, ఎం.ధర్మారావు, సోడే నాగేశ్వరరావు, పుడిగి దేముడు, జి.తేజోరావు, కె.సూరి బాబు, యం.రమేష్‌బాబు, ఎస్.కన్నయ్యతో పాటు జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా యువి నారాయణ, సభ్యులుగా పి.మంగ రాజు, కె.రాముసాద్, డివిని సత్యనారాయణ, ఎల్ నారాయణ, రాష్ట్ర కౌన్సిలర్స్ గా వై విల్సన్, ఎల్ నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం పాటు పడతామని అన్నారు.



విద్యార్థులను ఇళ్లకు తీసుకెళుతున్న తల్లిదండ్రులు

విద్యార్థులు ఇంటి బాట

ప్రజాశక్తి- పెదబయలు: ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని గురుకుల టీచర్లు ఆందోళన బాట పట్టడంతో తరగతులు జరగని కారణంగా పెదబయలు గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు ఇంటి బాట పట్టారు. ఉద్యోగ భద్రత కోసం ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు ఆందోళన చేపడుతున్న విషయం తెలిసిందే. ఇంటి వెళ్లేందుకు సిద్ధమైన పిల్లల తల్లిదండ్రులను విలేకర్లు ప్రశ్నించగా ఉపాధ్యాయులు లేక పిల్లల్ని ఇంటికి తీసుకెళ్లి పోతున్నామని పేర్కొన్నారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ సన్యాసిరావు అక్కడికి చేరుకొని పిల్లలు ఎందుకు ఇళ్లకు పోతున్నారని అడిగి తెలుసుకొన్నారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ సన్యాసిరావు మాట్లాడుతూ, సుమారు 18 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న గురుకుల ఉపాధ్యాయులకు అన్యాయం చేయడం తగదన్నారు. ఎన్నో కష్టాలు పడుతూ ఈ వృత్తినే నమ్ముకున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు మద్దతుగా ఉంటామని తెలిపారు. గురుకులాల్లో ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డి శంకర్ రావు మాట్లాడుతూ, విద్యార్థులు ఇళ్లకు పోవద్దని రేపే ఉపాధ్యాయులు వచ్చేస్తున్నారని చెప్పారు.

పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో..

పారా మెడికల్ పోస్టులు గిరిజనులకే కేటాయించాలి

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర



మాట్లాడుతున్న కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: అల్లూరి జిల్లా పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 256 వివిధ రకాల పారామెడికల్, మినిస్టీరియల్, ఒప్పంద పొరుగు సేవలు పోస్టులను వందశాతం స్థానిక ఆదివాసీలకు కేటాయించాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. అరకులోయ మండల కేంద్రంలోని ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రస్తుతం నియమిస్తున్న 4 రకాల పోస్టుల నియామకంలో గిరిజనేతరులకు కేటాయించిన 100 పోస్టులు వెంటనే రద్దు చేసి ఆదివాసీలకు కేటాయించాలన్నారు. జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ అసిస్టెంట్ మొత్తం 31 పోస్టులకు గాను గిరిజనేతరులకు 12 పోస్టులు కేటాయించడం దారుణమన్నారు. ఆఫీసు, సబర్డినేట్ మొత్తం పోస్టులు 269 పోస్టులకు 57 పోస్టులు గిరిజనేతరులకు కేటాయించారని, నరల్ డ్యూటీ అటెండెన్స్ మొత్తం 169 పోస్టులకు గాను 30 పోస్టులు గిరిజనేతరులకు కేటాయించడాన్ని ఆదివాసీ గిరిజన సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. జివో 3 ప్రకారం వందశాతం పోస్టుల నియామకాలు ఆదివాసులతో నియామకాలు జరపాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలలో అన్ని రకాల నియమకాలు జివో 3 ప్రకారం జరపకపోతే ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పి.బలాదేవ్, మండల అధ్యక్ష కార్యదర్శులు జి.బుజ్జిబాబు, జి.చిన్నబాబు, కె.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ఐటిడిఎ పిఒ అభిషేక్



విద్యార్థులతో మాట్లాడుతున్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలో తురకలవలస ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో సోమవారం కేరీర్ గైడెన్స్‌ను పిఒ అభిషేక్ ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో భాగంగా పాడేరు నుండి ఇతర పాఠశాలల నుండి ఇద్దరేసి ఉపాధ్యాయులను ఎంపిక చేసి శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు ఉపాధి పొందే వరకు కెరీర్ గైడెన్స్ ఇస్తామని, ఆసక్తి గల పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన గిరిజన విద్యార్థులు హాజరు కావాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పిఒ అభిషేక్ మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నతంగా చదువుకుని పారిశ్రామిక వేత్తగా ఎదగాలని సూచించారు. పది తరువాత ఇంటర్‌లో ఏ గ్రూపు తీసుకుంటే మంచిదో అవగాహన కల్పించారు. ఇంటర్మీడియట్‌లో ఏ గ్రూపు తీసుకుంటే డిగ్రీలో చేరాలి.. ఆయా డిగ్రీలతో పొందుతున్న ఉపాధి అవకాశాలను వివరించారు. ఆసక్తి ఉన్న రంగాలను ఎంచుకోవాలన్నారు. ప్రతీ ఇంటిలో ఒక పారిశ్రామిక వేత్త ఉండాలని పేర్కొన్నారు. ముందుగా బాబూ రాజేంద్ర ప్రసాద్, అంబేద్కర్ చిత్రపటాలకు పూల మాలలు వేశారు. గిరిజన విద్యార్థులందరూ కనీసం డిగ్రీవరకు చదువు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్.రజని, ఎటిడబ్ల్యూఒ వెంకట రమణ, ఎం.ఇ.ఓ మార్గదర్శిని, ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎయును సందర్శించిన జపాన్ తొయామా వర్సిటీ ప్రతినిధులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని జపాన్‌లోని తోయామా ప్రొఫెక్చరల్ యూనివర్సిటీ ప్రతినిధులు సోమవారం సందర్శించారు. తోయమా వర్సిటీ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ టెక్సో హతకేయమ ఆధ్వర్యాన నిపుణుల బృందం సందర్శించి అధికారులతో భేటీ అయ్యారు. ముందుగా ఎయు వీసీ ఆచార్య జి.శశిభూషణరావు జపాన్ బృందానికి ఎయు ప్రాధాన్యతను వివరించారు. ఎయులో జపాన్ ఇన్ఫర్మేషన్ సెంటర్ గతంలోనే ఏర్పాటు చేశామని, ప్రతి సంవత్సరం జపాన్‌కు తమ విద్యార్థులు వస్తున్నారని తెలిపారు.

అనంతరం జపాన్ ఆచార్యుడు హతకేయమా మాట్లాడుతూ, తొయామా వర్సిటీలో ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజినీరింగ్, ఫ్యాకల్టీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీరింగ్, ఫ్యాకల్టీ ఆఫ్ నర్సింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. స్టూడెంట్ ఎక్స్ఛేంజ్, కల్చరల్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాలను నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అకాడమిక్ కొలాబరేషన్ కోసం తాము ఆంధ్ర విశ్వవిద్యాలయానికి వచ్చామని తెలిపారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్.ధనంజయరావు, అకడమిక్ డీన్ కె.ఈశ్వర్‌కుమార్, ప్రిన్సిపల్ గిరిజాశంకర్, పద్మశ్రీ, డీన్‌లు ఆచార్య పి.మల్లికార్జునరావు, కె.రమాసుధ, భాస్కర్‌రెడ్డి, చల్లా రామకృష్ణ, తోయమా వర్సిటీ అకాడమిక్ అఫైర్స్ డివిజన్, డైరెక్టర్ యోషిజవా యాసుకి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



నిందితునితో పోలీసులు

570 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-ముంచంగి పుట్టు : మండలంలో పోలీసులు జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 570 కిలోల గంజాయిని పట్టుకున్నామని స్థానిక ఎస్సై జె రామకృష్ణ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... బొలెరో వాహనంలో సుమారు 570 కిలోల గంజాయి అక్రమంగా తరలిస్తుండగా ఒక వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. పరారైన వ్యక్తిని పట్టుకునేందుకు పోలీసు సిబ్బందితో గాలిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ లక్ష్మణరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బెల్లం పులుపును ధ్వంసం చేసిన పోలీసులు

బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-చింతపల్లి: నాటు సారా తయారు చేసేందుకు ఉపయోగించే సుమారు 5 లక్షల విలువ గల బెల్లపు ఊట ధ్వంసం చేయడం జరిగిందని ప్రొఫెషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సిఐ జె కుర్మారావు తెలిపారు. నర్సీపట్నం ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ, ఏపీ ఎన్ఫోర్స్మెంట్ టీంల సమన్వయంతో చింతపల్లి మండలంలోని పెదబరడ పంచాయతీ పరిధిలోని పెదగొంది, రబ్బరుగొంది గ్రామాలలో దాడులు నిర్వహించారు. ఈ దాడులలో సారా తయారు చేసేందుకు ఉపయోగించే 1600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయడం జరిగిందని అన్నారు. నాటు సారా తయారు చేసినా విక్రయాలు జరిపినా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ అధికారి వై.కిరణ్ కుమార్, నర్సీపట్నం ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ అధికారి టీవీఏ నాయుడు, కానిస్టేబుల్ రవితేజ, ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జిసిసి చైర్మన్‌కు సత్కారం

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా కేంద్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్‌ను తన కార్యాలయంలో ఆదివాసి విలేకరుల పరిరక్షణ సేవా సంఘం అధ్యక్షులు తాంగుల మహేష్, కార్యదర్శి కొర్ర కృష్ణల ఆధ్వర్యంలో సంఘం సభ్యులు సోమవారం సన్మానించారు, పాత్రికేయుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు పాత్రికేయుల ఇళ్ల స్థలాలు, పిల్లల ఫీజు రాయితీ, అక్రిడేషన్, బస్సు పాస్ తదితర సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారంకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

మెరిట్ లిస్ట్‌లో అవకతవకలపై చర్యలకు వినతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల హెల్త్ సెక్రటరీల ఉద్యోగోన్నతుల మెరిట్ లిస్ట్ తయారీలో జరుగుతున్న అవకతవకలను ఆపాలని, అవకతవకలకు పాల్పడుతున్న, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సామూహిక వినతి పత్రాన్ని ఎపి యునైటెడ్ విలేజ్, వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ ఆసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.మణి మాట్లాడుతూ విశాఖ జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల హెల్త్ సెక్రటరీల ఉద్యోగోన్నతి మెరిట్ లిస్ట్ తయారీలో జరుగుతున్న అవకతవకలను ఆపాలని డిమాండ్ చేశారు. వాటిపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గత నెల 11న ఫిర్యాదు చేసి కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చామన్నారు. అయినప్పటికీ డిఎం అండ్ హెచ్ఒ, ఆఫీసర్లు కనీసమైన జవాబుదారీతనాన్ని కనపర్చలేదన్నారు. గత్యంతరం లేక మళ్ళీ ఈ రోజు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు ఆళ్ల దేవకి, విశాఖపట్నం అధ్యక్షురాలు ఎస్.సుభాషిణి, జిల్లా నాయకులు రత్నం, కల్యాణి, రాజ్యలక్ష్మి, రాణి, భాగ్యలక్ష్మి, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల కారణంగా పలు రైళ్లను నిడదవోలు - భీమవరం టౌన్ - గుడివాడ - విజయవాడ మీదుగా దారి మళ్లించనున్నట్టు రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 13351 ధన్‌బాద్ - అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్ డిసెంబర్ 2, 4, 6, 7, 9, 11, 13, 14 తేదీల్లోనూ, 12376 జసిదిహ్ - తాంబరం ఎక్స్‌ప్రెస్ డిసెంబర్ 4, 11 తేదీల్లోనూ, 18637 హతియా - ఎస్ఎంవి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ డిసెంబర్ 7, 14 తేదీల్లోనూ, 12889 టాటా నగర్ - ఎస్ఎంవి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ డిసెంబర్ 6, 13 తేదీల్లోనూ, 22837 హతియా - ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ డిసెంబర్ 2, 9 తేదీల్లోనూ సాధారణ మార్గం నిడదవోలు - తాడేపల్లిగూడెం - ఏలూరు మీదుగా కాకుండా మళ్లించిన మార్గమైన నిడదవోలు - భీమవరం టౌన్ - గుడివాడ - విజయవాడ మీదుగా ప్రయాణిస్తాయి. ప్రజలు ఈ మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

ఇగ్నో వార్షిక పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలో ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అక్కడ పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహించారు. మొబైల్ ఫోన్స్ వంటి సాంకేతిక ఉపకరణాలను పరీక్షా కేంద్రాలలోకి అనుమతించలేదు. ఇగ్నో జారీ చేసిన గుర్తింపు కార్డును తీసుకువచ్చిన వారినే పరీక్షా కేంద్రాల్లోకి పంపించారు.

కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: వన్ టౌన్ బురు జుపేటలో ప్రసిద్ధి చెందిన కనకమాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవ వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అమ్మవారి దేవాలయం మరింత అభివృద్ధి చేసి, భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించుటకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కూటమి వార్డు అధ్యక్షులు, ఆలయ ఈవో శోభారాణి, ఎఈవో తిరుమాళేశ్వర రావు, ఈఈ రమణ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెడుతున్న పాలకులు



జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్షల్లో కూర్చున్న సిఐటియు కార్యకర్తలు

ప్రజాశక్తి -ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే కుట్రలో భాగంగా కర్మాగారాన్ని కోలుకోలేనంత నష్టాల్లోకి పాలకులు నెడుతున్నారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1391వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని ఐఎన్‌టియుసి కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన భూములను కాజేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వకుండా ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చేసి కేంద్రంతో మాట్లాడి స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలని కోరారు.

విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ ఉద్యమం ఒక వ్యక్తికి సంబంధించినది కాదని, విశాఖ ప్రజల మనోభావాలతో ముడిపడి ప్రజల రక్తం నుంచి, కార్మికుల చెమట చుక్కల నుంచి వచ్చిన మహోద్యమమని, ప్లాంట్ ప్రైవేటీకరణను విరమించే వరకు పోరాడుతామని సిఐటియు జిల్లా సీనియర్ నాయకులు వై.రాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే దీక్షలు సోమవారం నాటికి 1343వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ కార్మికులు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.నర్సింగరావు, హాస్పిటల్ కార్మికులు లక్ష్మీ, రమ, శ్రీను పాల్గొన్నారు.

సాయుధ దళాల పతాక దినోత్సవానికి విరాళాలివ్వండి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: ఈ ఏడాది కూడా నగరంలో సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని, దీనికి ప్రజలు విరివిగా విరాళాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్లో జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రంలో సాయుధ దళాల పతాక దినోత్సవం పై సమీక్షించారు. ఈనెల 7న సాయుధ దళాల పతాక దినోత్సవం జరుప నున్నామన్నారు. గత సంవత్సరంలో రాష్ట్రంలోని పతాక నిధికి అత్యధికంగా విరాళాలు రూ.24,48,729 సేకరించినందుకు విశాఖపట్నం జిల్లా ప్రథమ స్థానం పొందిందన్నారు. గత సంవత్సరం సాయుధ దళాల పతాక నిధికి సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ (యుసిడి), డిఆర్‌డిఎ, విద్యార్థులు, ఇతర ప్రజల నుండి విరాళాల ద్వారా ఆ మొత్తం వసూలు అయ్యిందన్నారు. 2024 సంవత్సరానకు జిల్లా విద్యా శాఖ అధికారి, ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి, ఇంటర్మీడియట్ బోర్డు అధికారులకు విద్యార్థుల నుండి, ఇండస్ట్రీస్ లో పనిచేసే వర్కర్స్ నుండి విరాళాలు సేకరించాలని కోరారు. పతాక నిధికి స్టిక్కర్లు, కార్ ఫ్లాగ్స్‌ల అమ్మకం ద్వారా విరాళాలు సేకరించాలని సూచించారు.

పలుచోట్ల ఎయిడ్స్‌పై అవగాహన



కెడిపిఎం పాఠశాలలో అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ మురళీ మోహన్

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని వెన్నెలపాలెం, సోమునాయుడుపాలెం, రావాడ గ్రామాలలో ఎయిడ్స్ డే సందర్భంగా సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్‌టిపిసి సింహాద్రి మొబైల్ హెల్త్ కేర్ యూనిట్ వైద్యులు డి.ప్రశాంత్, ప్రణీత్ కుమార్ ఎయిడ్స్ నివారణ మార్గాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో వెన్నెలపాలెం ఉప సర్పంచ్ వెన్నెల సన్యాసిరావు, పైల సన్యాసిరావు, జనసేన నాయకులు పీవీ నర్సింహారావు, వెన్నెల ఈశ్వరరావు, గ్రామ పెద్దలు బి.నాయుడు, పి.ప్రసాద్, మొబైల్ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : పెద వాల్తేరులోని కెడిపిఎం ఉన్నత పాఠశాలలో ఎయిడ్స్ వ్యాధిపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మురళీమోహన్ పాల్గొని ఎయిడ్స్ చరిత్ర, ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ నిర్వహణ ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ హెచ్ఐవి మహమ్మారిని అంతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలలో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుమతీ బాయి, కెడిపిఎం హైస్కూల్ సిబ్బంది, గీతం మెడికల్ కాలేజీ ఇంటర్న్స్ అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.



కాలిపోయిన విద్యుత్ సర్వీస్ వైర్లు

వానర మూకలు వీర విహారం

- విద్యుత్ వైర్లు కలిసిపోవడంతో షార్ట్ సర్క్యూట్

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో సోమవారం ఉదయం వానర మూకలు చిలిపి చేష్టలతో వీర విహారం చేశాయి. దీంతో సీలేరు మార్కెట్ సెంటర్‌లో విద్యుత్ స్తంభం వైర్లు రెండు కలిసిపోవడంతో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. ఈ ఘటన చూసి వ్యాపారులు బిత్తర పోయారు. వెంటనే షాపుల యజమానులు ఎపి ట్రాన్కో సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. కటౌట్లు తొలగించి, విద్యుత్ స్తంభంపై కాలిపోయిన విద్యుత్ వైర్లను సరి చేశారు. ప్రతిరోజూ వానర మూకలు ఇంటి పైకప్పులపై వీర విహారం చేయడంతో పాటు విద్యుత్ వైర్లు, టెలిఫోన్ వైర్లకు నష్టం చేకూర్చుతున్నాయని స్థానికులు, వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఏపీ జెన్కో అధికారులు, స్థానిక పంచాయతీ సర్పంచి, అధికారులు వానర మూకల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

19న ఆడాకులలో గ్రామసభ

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం ఆడాకుల గ్రామంలో ఈనెల 19న గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ఎస్ఎల్వి.ప్రసాద్ సోమవారం తెలిపారు. తాము సాగు చేసుకుంటున్న భూములను వెబ్ ల్యాండ్లో నమోదు చేయాలని 36 మంది గిరిజనేతరులు దరఖాస్తు చేసుకున్నారని, దీంతో గ్రామసభ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. వెబ్ ల్యాండ్లో నమోదు చేయడానికి సంబంధించి ఎవరికైనా ఏవైనా అభ్యంతరాలు ఉంటే గ్రామసభలో తెలియజేయాలని సూచించారు.

ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ఇసుక కొండ సత్యనారాయణ స్వామి దేవస్థానం అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఆలయ అభివృద్ధికి మరిన్ని నిధులను సమకూర్చనున్నట్లు తెలిపారు. సోమవారం ఆయన సత్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అభివృది పనులను , ఘాట్ రోడ్డును పరిశీలించారు. ఆలయ అభివృద్ధి పనుల్లో జాప్యం చేయకూడదని, భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.

ప్రీమియం బ్రాండ్స్‌పై ఆసక్తి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: వినియోగదారుల అభిరుచులలో మార్పు వచ్చిందని, ప్రీమియం బాండ్స్ వైపు ఆసక్తి కనపరుస్తున్నారని ఇంటర్నేషనల్ స్పిరిట్స్ అండ్ వైన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సిఈవో సంజిత్ పద్ది తెలిపారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ, ప్రీమియమ్ అభివృద్ధి పెరుగుతున్న ఆదాయం, గ్లోబల్ ఎక్స్‌పోజర్లు, వినియోగదారుల అభిరుచులలో మార్పులతో జరుగుతుందన్నారు.

అర్జీలపై పూర్తి స్థాయిలో విచారణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను 48 గంటలలోపు ఓపెన్ చేసి, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పునరావృతం కాకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, ఆర్డీవో శ్రీలేఖ, జివిఎంసి అడిషనల్ కమిషనర్ వర్మ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి విచ్చేసిన అర్జీదారుడు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందేలా సత్వర, శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు.